
# జ్ఞాపకం

కథ

## లెనిన్



హరికేన్ లాంతరు వెలుగుతో చీకట్లో ఎవరైనా నడిచి వెళ్లడం కంటపడ్డప్పుడు నాకు సునంద గుర్తుకొచ్చేది. సునంద గుర్తుకు రావడం ఇదే మొదటిసారి కాదు. ముగ్గులతో నిండిపోయిన ముంగిళ్లను చూసినప్పుడు, ఒకబ్బాయి ఓ అమ్మాయి జంటగా వెళ్లడం కంటపడ్డప్పుడూ సునంద గుర్తుకొచ్చేది. గుర్తుకు రావడమే కాదు. తనని చూడాలని మనసులో బలంగా అనిపించేది.

సునంద గురించి చెప్పాలంటే... సునంద నా జీవనయానంలో వసంతంలా కొంతకాలం నాతోబాటూ ప్రయాణించిన సహచరి. ప్రాయపు తొలిదినాల్లో తారసపడ్డ తరుణిమ. ఉషోదయపు ఉషస్సులా కళ్లముందు నిలిచే కాంతిరేఖ. వేకువ వెలుగుల్లో వెండి జిలుగుల ముత్యాల ముగ్గుల్ని, వీధి గుమ్మంలో అలంకరించే ప్రత్యూష పవనం.

సునందతో పరిచయం ఏ శుభసమయాన జరిగిందో కానీ, ఆ పరిచయ పరిమళపు గుభాళింపు ఎప్పటికీ ఆస్వాదితమే! ఆ రోజులు గుర్తుకు రాగానే మనసంతా మల్లెల సౌరభం నిండిపోయిన భావన కలుగుతుంది.

రెండే రెండు వీధులతో ఆ ఊరు చాలా బావుండేది. మొదటి వీధిలో పౌరోహిత్యం చేసే బ్రాహ్మణులు, హైస్కూల్లో పనిచేసే ఉపాధ్యాయులు వుండేవారు. వీధికి మొదట్లో నాలుగు మర్రి చెట్లు వుండేవి. ఊళ్లోకి స్వాగతం చెబుతున్నట్లుండే వాటి కింద నిలబడి చూస్తే, వీధికిరు వైపులా ఇళ్లు. మొదటగా వుండే ఇళ్లు పెద్దవిగానూ, తరువాత వున్న ఇళ్లు క్రమేపీ చిన్నవిగాను వుండి వీధి చివర కలిసిపోయినట్లుండేవి.

రెండో వీధిలో మిగిలిన వృత్తులవారు, వ్యవసాయ కూలీలు వుండేవారు. దానికి వెనక వైపున పారే సెలయేరు, అందులో స్నానాలు చేసే మగవారితోనూ చెలమలు తవ్వి దొంతి కుండల్లో నీళ్ల తీసుకు వెళ్లే ఆడవారితోనూ అది మరో వీధిని తలపించేది.

బస్సు సౌకర్యం లేకపోవడం వలన వూరికి వ్యాపార ధోరణి అలవడలేదు. రూపాయికి చెంబుడు పాలు దొరికేవి. నవ నాగరికత చొరబడకపోవటం వలన సాంప్రదాయాల ఆచార వ్యవహారాలకు ఆలవాలమై వుండేది. కల్మషం లేని మనుషులతో నిత్యం కలకలలాడుతుండేది.

వీధిలో పెంకుటిళ్లన్నీ పగటివెలుగులో తలకు జేగురు రంగు వేసుకొని వరుసలో నిలబడ్డ తెల్ల కొంగల్లా వుండేవి. రాత్రిళ్లలో ఇంటి గుమ్మాలకు వేలాడదీసే లాంతర్ల వెలుగులతో ఇళ్లన్నీ తెరచాప లెత్తి సముద్రం ఒడ్డున వరుసలో నిలబెట్టిన వేట పడవల్లా శోభిల్లేవి.

అలాంటి ఊరితో నాకు పరిచయం ఏర్పడడం బావగారి చలవే. ఆయన వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. అక్క పెళ్లి అప్పగింతలప్పుడే నా చదువును బావగారి చేతిలో పెట్టారు నాన్నగారు. చంటిపిల్లలతో సతమతమయ్యే అక్కకు ఇంటిపనుల్లోనూ, బజారుకు వెళ్లి సరుకులు తేవడం వంటి బయటి పనుల్లోనూ బావకు చేదోడు వాదోడుగా వుంటూ వారు బదిలీ అయినప్పుడల్లా వారితోపాటే నేనూ, నా చదువు బదిలీ అయిపోయేవి.

అలాంటి బదిలీల ప్రహసనంలో భాగంగా నేనా వూరికి చేరుకునేసరికి పరువం పై పెదవి మీదతన ప్రయత్నాలను ప్రారంభించింది. కొత్త పరిసరాల వల్లనో, కొత్తగా చేరిన బిడియం వల్లనో నేనెవ్వరితోనూ అంతగా మాట్లాడేవాడిని కాను. కానీ... ఆ వూరు, ఏరు, కోనేరు, కోవెల, మర్రి చెట్లు, మనుషులు వారి పద్ధతులు ఇవన్నీ నాకెంతో నచ్చాయి. ఊరికి వచ్చిన కొత్తల్లో సునంద మా ఇంటికి వచ్చేది. చిన్న చిన్న పనుల్లో అక్కకు సాయం చేసేది. మొదట్లో నేను అంతగా గమనించలేదు కానీ తరచుగా ఇంటికి రావడం, అక్కకు నేను సాయం చేసే పనులన్నీ నా ప్రమేయం లేకుండానే పూర్తవ్వడంతో సునంద నా దృష్టిలో పడింది.

కోలముఖం, చురుకైన కళ్లు, నిగ్గుతేలిన బుగ్గలు, నిగారింపైన మేనిఛాయతో... బుట్టచేతుల పట్టు జాకెట్టు, పరికిణీల్లో పొడుగ్గా, వయసు తెచ్చిన సొగసులతో చూడచక్కగా వుండేది. మనిషి నడక, నడత, మాటతీరు ముచ్చటగొలిపేవి. పండగల్లాంటి ప్రత్యేకమైన రోజుల్లో ధరించే లంగా వోణీల్లో పదహారణాల పడుచుపిల్లకు పర్యాయపదంలా వుండేది.


కూతురికి మంచి చదువు అందివ్వాలన్న ఆశతో మా ఇంటికి పంపించి చదివించడానికి టీచరైన బావగారి అనుమతి తీసుకున్నారు సునంద తల్లిదండ్రులు. పనుల్లో సాయం వుండడం వల్ల అక్క సిఫార్సు బావగారి అంగీకారానికి కొంతమేర సాయపడింది. ఏమైనప్పటికీ సునంద రాకతో అక్క పనుల ఒత్తిడికి, నా ఒంటరితనపు చదువుకు కొంత వెసులుబాటు కలిగింది.

మా ఇల్లు మొదటివీధిలో ఈ చివర్న వుంటే, సునంద వాళ్లిల్లు రెండో వీధిలో ఆ చివర్నుంచి కొద్దిగా లోపలకి వుండేది. రెండు వీధుల్ని కలుపుతూ చివర్న ఓ మట్టిరోడ్డు వుండేది. ఉదయం నేను పక్కమీంచి లేవక ముందే సునంద మా ఇంటికి వచ్చేది. గదులు గుమ్మాలన్నీ పసుపు నీళ్లతో కడిగి కుంకుమ బొట్లతో అలంకరించేది. వాకిలి వూడ్చి పేడనీళ్లతో కళ్లాపు చల్లేది. అలా జల్లేటప్పుడు చేతులకున్న మట్టిగాజులు చేసే చప్పుడుకు మెలకువ వచ్చేది. చెట్ల మీద పక్షుల కిలకిలరావాలకు తోడుగా లయబద్ధంగా సాగే ధ్వని మనసుని మెత్తగా తాకేది. ఎడం చేతిలో ముగ్గు గిన్నెతో, కుడిచేత్తో వేళ్ల సందుల్లోంచి ముగ్గుపిండిని జారవిడుస్తూ ముఖమ్మీద పడుతున్న ముంగురులను మధ్య మధ్య వెనక్కి తోసుకుంటూ, చిత్రకారుడు తను చేసే చిత్రాన్ని ఎంత ఏకాగ్రతతో వేస్తాడో అంత శ్రద్ధగా ముగ్గుల్ని ముత్యాల అమరికలా తీర్చిదిద్దేది. ముందుకు పడుతున్న ముంగురుల్ని సవరించుకోవడానికి మెడ పైకెత్తినప్పుడు, ప్రత్యూష కిరణాలు పడి మెరిసిపోయే ముఖం నారింజరంగులో చూడడానికి అద్భుతంగా వుండేది.

ఊరిచివర ఏటి వద్దకు వెళ్లి స్నానాలవీ ముగించుకొని ఇంటికొచ్చేసరికి సునంద ఫలహారాలు సర్దే పనిలోనో, వంటపనిలోనో అక్కకి సాయం చేస్తూ వుండేది. చంటిపిల్లల్ని ఎత్తుకోవడం, బావి నీళ్లు చేదుకు రావడం, ఇంట్లో చిందర వందరగా పడివున్న వస్తువుల్ని సర్దిపెట్టటం వంటి పనులన్నీ నేనే చేసేవాడిని. సునందరాకతో అవన్నీ దూరమైపోయాయి. ఇంట్లో ప్రతీపనిలోనూ తన స్పర్శ వుండేది. ప్రతి అలంకరణలోనూ తనదైన ముద్ర వుండేది. నడుస్తూ కాలి మువ్వల చప్పుడుతో ఇల్లంతా సందడి చేసేది. నవ్వులతో గదుల్లో గాలికి చైతన్యాన్ని అద్దేది.

ఊరికి కరెంటు లేకపోవడంతో గాజు చిమ్నీలు అమర్చిన హరికేన్ లాంతర్ల 'డూం' లైట్లు ప్రతి ఇంట్లోనూ తప్పనిసరి. ఒకసారి వాడిన తర్వాత మళ్లీ వెలిగించాలంటే మసిపట్టిన గాజుచిమ్నీలను మెత్తని బూడిదతో తోమి పొడిగుడ్డతో శుభ్రం చేయాలి. ప్రతిరోజూసాయంత్రం లాంతర్లు తుడిచే పని నాదే. మెల్ల మెల్లగా అది కూడా సునంద ఖాతాలో వేసుకుంది. ఆ పని కూడా శిల్పం చెక్కినంత పొందిగ్గా, శ్రద్ధగా, నాజూగ్గా చేసేది.

తర్వాత వాళ్లింటి దగ్గర పనులన్నీ పూర్తి చేసుకొని శుభ్రంగా తయారై వచ్చేది. వస్తూ వస్తూ తనతో పాటు ఓ లాంతరు తెచ్చుకునేది. ఆ లాంతరుతో సహా ఇంట్లో దీపాలన్నీ వెలిగించి ఇల్లంతా వెలుగులు నింపేది. ఆ పాటికే గుమ్మాలకు తగిలించి వెలిగించే హరికేన్ లాంతర్లతో వీధిలో ఇళ్లన్నీ తెరచాపలెత్తే పడవల్లా వుండేవి. చీకటి పడే వేళ గడపలో ఒకే



లాంతరు దగ్గర మా చదువులు ప్రారంభమయ్యేవి. నేను మౌన పఠనం చేస్తూ చదివేవాడ్ని. తను చిన్నగా చప్పుడు చేస్తూ చదివేది. చదివేటప్పుడు పెదవులు మనోహరంగా కదిలేవి. నా చదువులో సగం సమయం తనని, తన సౌందర్యాన్ని గమనించడానికే సరిపోయేది.

సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో వాళ్ల నాన్న వచ్చి తనని ఇంటికి బయల్దేరతీసే వరకూ మా చదువులు అలా కొనసాగుతూనే వుండేవి. చేతిలో హరికేన్ లాంతరుతో పక్కన వాళ్లనాన్నతో వీధి చివర చీకటిని పారద్రోలుతూ సునంద వెళుతుంటే చూడడానికి ఆ దృశ్యం సుందరంగా వుండేది. మలుపు తిరిగి రెండో వీధిని కలిపే మట్టిరోడ్డులో ప్రవేశించే వరకూ నేనలా చూస్తూనే వుండిపోయేవాడ్ని.

సునంద నాన్నగారికి వున్న ఉబ్బసం చలిగాలిలో తిరిగితే ఎక్కువయ్యే సూచనలున్నాయని వైద్యుడు సెలవివ్వడంతో సునందకు తోడుగా ఇంటి వరకూ వెళ్లేపని నాదయింది. చీకటిరాత్రి లాంతరు వెలుగులో నేను, సునంద నిశ్శబ్దాన్ని తోడుగా చేసుకొని నడవడం చాలా బావుండేది. కాలి అందెల రవళి ఆగి ఆగి వినిపించే కీచురాళ్ల ధ్వని, నిశ్శబ్దాన్ని హృద్యంగా చెదరగొట్టేవి. దూరంగా చీకటిలో మిణుగురులు చుక్కల్లా మెరిసిపోయేవి. సన్నగా శ్రావణపు మాసపు వర్షపు జల్లు పడ్డప్పుడు తనతో కలిసి నడవడం గమ్మత్తుగా వుండేది. చేతిలో లాంతరుతో తను, గొడుగు పట్టుకొని పక్కనే నేను, ఇద్దరం ఒద్దికగా నడవడం చెప్పలేని అనుభూతి. అలా చాలాసేపు నడవాలనిపించేది. కానీ అదేంటో! మిగతా రోజుల కన్నా వేగంగా ఇల్లు వచ్చేసినట్లుండేది. ఇంటిదగ్గర వీడ్కోలు చెప్పేటప్పుడు తన కళ్లల్లో కృతజ్ఞతతో మెరిసే కాంతిరేఖ నాలో చేరి ఐక్యమైపోయేది. తిరిగి వచ్చేటప్పుడు చూస్తే దారిపొడుగునా తడిసిన మట్టిలో ఇద్దరి అడుగుల ముద్రలు మెరుపు వెలుగులో తళుక్కుమనేవి. రోజూ వర్షం కురవాలనే ఆశ మనసులో మెరిసి మాయమైపోయేది. ఇంటికి చేరుకున్న చాలాసేపటివరకూ తనతో నడిచిన జ్ఞాపకం, తడిసిన బట్టల్లా ఆరేదికాదు. తనతో నడిచినప్పుడు మౌనంగా కాకుండా ఏదన్నా మాట్లాడాలని అనిపించేది. కానీ గొంతులో ఏదో అడ్డం పడ్డట్లు మాట వచ్చేది కాదు. పెదాలు కూడా వీడలేదన్న విషయం అర్థమై మనసు గింజుకునేది. మౌనం మా ఇద్దరి మధ్యా కోటగోడలా కూర్చునేది. కాలం ప్రవాహమై సాగిపోయేది.

జీవితం నిర్మించుకునే ప్రయత్నంలో నేనా వూరికి దూరమైపోయాను. బదిలీ వల్ల బావగారి కటుంబం ఊరికి దూరమైపోయింది. జీవితం ఎక్కడ్నుంచి ఎక్కడికో సాగిపోయింది. కాలం కరిగి జ్ఞాపకమైపోయింది.

చాలా రోజుల తర్వాత వున్నట్లుండి వూర్లో స్నేహితుని దగ్గర్నుంచి కబురొచ్చింది. 'ఊర్లోకి సునంద వచ్చిందని, చూడలనుకుంటే రమ్మనమంటూ'

ఎన్నాళ్లనుంచో ఎదురుచూస్తున్న అవకాశం పాత స్నేహితురాల్ని కలుసుకోవాలని మనసు ఉవ్విళ్లూరింది. పుష్కర కాలం క్రితం వికసించిన స్నేహకుసుమం మళ్లీ సువాసనలు విరజిల్లబోతున్నదా! ఆఫీసుకి ఫోన్ చేసి అర్జంటు పనుందంటూ రెండ్రోజులు సెలవు తీసుకున్నాను. బ్యాగు సర్దుకున్నాను. అందులో మా ఇద్దరి జ్ఞాపకంగా వున్న వస్తువులు కొన్ని తనకి చూపించడానికి సర్దాను.

ఇంతలో బయట గుమ్మం ముందు కారు ఆగిన చప్పుడు. చూస్తే కరుణ ఇంట్లోకి వస్తూ కనిపించింది.

''ఏంటలా చూస్తున్నావ్! చెప్పాపెట్టకుండా ఇలా ప్రత్యక్షమయ్యాననా! ఏం లేదు మొక్కు తీర్చుకోవడానికి గుడికి వచ్చాను. ఇంతదాకా వచ్చాను కదా! నిన్ను కూడా చూసి పోదామనిపించి వచ్చాను''

నాకేం మాట్లాడాలో అర్థంకాలేదు. ముక్తసరిగా మాట్లాడుతూ వుండడం చూసి 'ఏరా! ఏమైనా ఇబ్బందా?'

''ఏంలేదు సునంద వూరికి వచ్చిందట. చూసి వద్దామని బయల్దేరుతున్నాను. ఇంతలో నువ్వొచ్చావ్.''

నా వైపు అదోలా చూసింది. ఆ చూపులో భావం నాకర్థం కాలేదు.

''ఏరా! ఎప్పుడో పదిపన్నెండేళ్ల క్రితం కాలమాన పరిస్థితుల వల్ల ఓ అమ్మాయితో కాస్త పరిచయం కలిగింది. ఆ పరిచయంలో కొన్ని జ్ఞాపకాలు, కొన్ని స్మృతులు వుండి వుండొచ్చు. అవి నీ వయస్సుతో పాటు ఎదిగి ఆ అమ్మాయిని ఓ అపురూపమైన వ్యక్తిగా నీ ఊహల్లో ప్రతిష్టించుకోవడం జరిగి వుండొచ్చు. అంతమాత్రాన ఆ అమ్మాయి నిన్ను గుర్తుపెట్టుకొని నీకోసం ఎదురు చూస్తుందనుకుంటున్నావా? వాస్తవంలో ఆ అమ్మాయి నీవనుకుంటున్నట్లు వుంటుందనుకుంటున్నావా? వున్నా... నిన్ను గుర్తుంచుకుంటుందంటావా? పుష్కర కాలంలో ఒక్కసారి కూడా మాట్లాడుకోకుండా, పలకరించుకోకుండా, అసలు ఏ కమ్యూనికేషన్ లేకుండా ఇన్నాళ్లు అపరిచితుల్లా వుండి, ఇప్పుడు హటాత్తుగా నీవెళ్లి ఏం చేస్తావ్? ఎందుకొచ్చావని చెబుతావ్? అసలేం ఆశించి ఇన్ని రోజుల తర్వాత కలవాలనుకుంటున్నావ్? అయినా ఆ అమ్మాయి ఇప్పుడున్న పరిస్థితులేమిటి?

వద్దురా! జీవితం చాలా విలువైనది. కాలగమనంలో ఎన్నో అనుభవాలు. అనుభూతులు కలుగుతుంటాయి. వాటినన్నింటినీ స్వీకరిస్తూ ముందుకెళ్లడంలోనే జీవిత పరమార్థం వుంది.'' మొక్కకు పూసిన ఏ పుష్పమూ దాన్నంటి పెట్టుకొని వుండదు. రాలిపోతూనే వుంటుంది. రాలిపోయిన దానిగురించి మొక్క వంగడం మొదలుపెడితే అది చెట్టుగా ఎప్పుడు ఎదుగుతుంది? పదమందికి ఎప్పుడు నీడని ఇవ్వగలుగుతుంది.

''వెళ్లొస్తా'' అంటూ వెళ్లిపోయింది కరుణ.

గదిలో అదోరకమైన స్తబ్ధత. కాలం ఘనీభవించిన ఉనికి.

స్తంభించిన గాలి కదలడంతో నాలో ఏదో చైతన్యం కలిగినట్లయింది. లేచి ఫోన్ దగ్గరకు నడిచాను. ఆఫీసుకు ఫోన్ చేయడానికి.

★

